క్లుప్తంగా

చనుగొండ్ల విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థిని ఝూన్సీరాణి

గూడూరు రూరల్: చనుగొండ్లలోఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఝూన్సీరాణి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక అయినట్లు మంగళవారం ఎస్‌ఏ పీడీ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ నెల 2న కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి వాలీ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో ఝూన్సీరాణి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ నెల 7 నుంచి 9 వరకు కడప జిల్లాలోని మైదుకూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థిని ఉపాధ్యాయ బృందం అభినందించింది.

కేసు నమోదు

పాణ్యం: బేతంచెర్ల మండలం సిమెంట్‌నగర్‌కు చెందిన ఎన్నె రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు ఎన్నె శ్రీకాంత్(28) గత నెల 29న సిమెంట్ నగర్ నుంచి స్నేహితులతో కలిసి పాణ్యంలో చేపలు పట్టుకునేందుకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో శ్రీకాంత్ అతని స్నేహితుడు పవన్ ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో తమ్మరాజుపల్లె వద్ద జాతీయ రహదారిపై కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఒకరు డివైడర్‌పై మరొకరు రోడ్డు కిందకు పడ్డారు. ఎవ్వరు గమనించకపోవడంతో 30వ తేదీన హైవే పెట్రోల్ అపోలీసులు గుర్తించి శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఉదయాన్నే పవన్‌కు మెలకువ రావడంతో బైక్ తీసుకుని వెళ్లిపోయాడు. శ్రీకాంత్ ఒంటిపై స్వల్ప గాయాలయ్యాయి. కొలేకోలేక శ్రీకాంత్ మృతి చెందినట్లు చెప్పారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'సుంకేసుల'కు 3,950 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి మంగళవారం 3,950 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. డ్యామ్‌కు చెందిన ఒక గేట్‌ను అర మీటరు మేర ఎత్తి 2,264 క్యూ సెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కేసీ కాల్వకు 1,616 క్యూ సెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. డ్యామ్‌లో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నేడు గడివేములలో సమావేశం

గడివేముల: మండల కేంద్రమైన గడివేముల రాజరాజేశ్వరీ సమావేశ మందిరంలో బుధవారం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమంపై సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, మండల అధ్యక్షుడు శివరామిరెడ్డిలు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పాల్గొని విజయంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన


విద్యార్థులకు బహుమతుల అందజేస్తున్న ఎఫ్ఎస్ఓ

పాణ్యం: వన్య ప్రాణుల సంరక్షణపై అటవీశాఖ ఆధ్వర్యంలో '' అటవీ వన్య ప్రాణుల సంరక్షణ వారోత్సవాలు'' నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాణ్యంలోని గిరిజన గరుకుల బాలుర పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫ్ఎస్ఓ బి. అనిల్‌కుమార్ మాట్లాడుతూ వన్య ప్రాణుల యొక్క సంరక్షణకు అటవీశాఖ తీసుకుంటున్న చర్యలు, అమలు చేస్తున్న చట్టాలను వివరించారు. అంతేకాక మన చూట్టు ఉండే చెట్ల సంరక్షణకు ప్రతి విద్యార్థి పాటుపడాలని సూచించారు. అనంతరం వన్య ప్రాణుల చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కారక్యక్రమంలో అటవీశాఖ, అధికారులు రఘురాముడు, జలమావలి, వెంకట్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో వ్యక్తిత్వ వికాసం

కర్నూలు సిటీ: దేహదారుఢ్యంతో పాటు మానసిక ఎదుగుదల, వ్యక్తిత్వ వికాసానికి ఎన్‌సీసీ దోహదపడుతుందని 28వ బెటాలియన్ కమాండెంట్ కల్నల్ అక్షయ్ మాధుర్ అన్నారు. వెంకాయపల్లె దగ్గర ఉన్న జి.పుల్లయ్య (స్వయం ప్రతిపత్తి)ఇంజినీరింగ్ కాలేజీకి ఎన్‌సీసీ విభాగం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళవారం ఆయన ఆ కాలేజీని సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు. సెలెక్షన్ కోసం హాజరైన బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. బీటెక్ అనంతరం సాయుధ దళాల్లో ఆఫీసర్లుగా ఎంపిక అయ్యేందుకు ఇది తొలిమెట్టు అని అన్నారు. ఫస్ట్ బ్యాచ్‌కి 40 మంది ఎంపికైనట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో కాలేజీ స్పెషల్ ఆఫీసర్ డా.వై పాండురంగయ్య, ప్రిన్సిపాల్ డా.సి శ్రీనివాసరావు, విద్యార్థి వ్యవహారాల డీన్ జి.శశికుమార్, ఏఎన్ఎం ఎం.మధుశేఖర్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత

● ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్


జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లో డాక్టర్లకు సూచనలిస్తున్న ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారుమూల పల్లెల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నారని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని గ్రామ సచివాలయం - 1 పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీ, ఎమ్మెల్యే సందర్శించారు. ఎంపీపీ బొంతల మునెప్పతో కలిసి క్యాంప్‌లో ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్, హెల్ప్ డెస్కులు, వైద్యం విధానాలను పరిశీలించారు. అదేవిధంగా ఈసీజీ పని తీరు పరిశీలించి మండలంలో జరిగే అన్ని హెల్త్ క్యాంప్‌లలో ఈసీజీని తప్పకుండా ఏర్పాటు చేయాలని వైద్యులను ఎంపీ, ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ క్యాంప్‌లో వైద్యానికి రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో వైద్యులు, ఎంపీ కేస్ షీట్ అందజేశారు. ఎమ్మెల్యేకు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ రక్తపరీక్షలు చేశారు. క్యాంప్‌లో అందుతున్న వైద్య సేవలపై ప్రజలను అడిగి వారు తెలసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యం, విద్యా రంగాలకు ప్రాధాన్యతన ఇస్తున్నారని ఈ సందర్భంగా ఎంపీ గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, సర్పంచ్ పాండురంగన్న, ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్ఎం బాషా, దిశా సభ్యుడు ఇల్లూరి నరసింహాయ్యశెట్టి, ఏపీ స్టేట్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ ప్యాలకుర్తి రమేష్, జిల్లా ఎస్‌ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు శాంతికుమార్, తహసీల్దార్ శేషఫణి, ఈఓఆర్డీ సందీప్, ఎస్ఐ పీరయ్య, డాక్టర్లు మిథున్‌కుమార్‌రెడ్డి, హరిచంద్రుడు, సునిత, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజలు ఉన్నారు.

ఇంటికే వైద్యం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే : ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇళ్ల వద్దనే వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. పల్లెల్లోనూ మెరుగైన వైద్య సేవలు అందజేసేందుకు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకొచ్చారని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. సీఎం సహకారంతో కోడుమూరు నియోజకవర్గాన్నికి ఇప్పటి వరకు దాదాపుగా రూ.8 కోట్ల మేర వైద్య సదుపాయం, సహాయ సేవలను అందించడం జరిగిందన్నారు. హెల్త్ క్యాంప్‌కు గ్రామస్తులు పోటెత్తడంతో మొత్తం 401 మందికి వైద్య సేవలను అందించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తెలిపారు.

● జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యానికి భరోసా


కోడుమూరు జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులో ఓపీ తీసుకుంటున్న మహిళలు

కోడుమూరు రూరల్ : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. మంగళవారం కోడుమూరులోని సంతమార్కెట్ బాలికల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఎమ్మెల్యే సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటిని, కుటుంబాన్ని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. హెల్త్ క్యాంపునకు ప్రజలనుంచి విశేష స్పందన లభించింది. దాదాపు 400మందికిపైగా ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, మలేరియా ఆఫీసర్ రంగస్వామి, డాక్టర్లు నస్రీన్, మదన్‌శేఖర్, లీలాప్రసాద్, రవితేజ, సాయిమోహన్‌రెడ్డి, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, కమాల్‌బాషా, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, డైరెక్టర్ ఇమ్మానేయులు, లీగల్ సెల్ జోనల్ ఇంచార్జి లాయర్ ప్రభాకర్, స్థానిక నేతలు అద్దుగల రాజశేఖర్‌రెడ్డి, మధుమోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బలరాం, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, వలంటరీలు పాల్గొన్నారు.


వృద్ధుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

పేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

గూడూరు రూరల్: పేదల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. చనుగొండ్లలో మంగళవారం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, కోఆప్షన్ సభ్యుడు దౌల, మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ రంగయ్య, గూడూరు నగర పంచాయతీ చైర్మన్ జె.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

● వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని, రామయ్య


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య


వృద్ధుడికి కళ్లజోడు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

కల్లూరు: పేదల ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ పరిధిలోని శరీన్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ కమిషనర్ బార్గవ్‌తేజతో కలిసి వారు సందర్శించారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్లను వారు పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రజల సమస్యలు గుర్తించి సంబంధిత ఆస్పత్రికి పంపేలా చర్యలు తీసుకోవాలని స్పెషలిస్టు వైద్యలను, యూపీహెచ్‌సీవైద్యులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే, మేయర్ బీపీ, మధుమేహ, కంటి పరీక్షలు చేయించుకున్నారు. తదనంతరం ఐసీడీసీఎస్ ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ స్టాల్స్‌ను పరిశీలించారు.

ఉచితంగా పరీక్షలు, మందులు

ప్రజలు వైద్యానికి ఇబ్బందులు పడకుడదనే ఉద్దేశ్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించి వారికి అవసరమైన పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తునామని ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య అన్నారు. మలేరియా, డెంగీ, బీపీ, మధుమేహం, గల్ల, కంటి, హీమోగ్లోబిన్ మొదలగు పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నామని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలు వైద్యనికి ఇబ్బందులు పడకుడదనే ఆరోగ్య శ్రీ పథకం తీసుకువచ్చారన్నారు. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు అడుగులు ముందుకేసి, ఆరోగ్యశ్రీని పటిష్టం చేసి, ఏకంగా 3,256 వ్యాధులకు వైద్య సేవలు అందించేల చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జయరాముడు, సుదర్శన్‌రెడ్డి, చిట్టెమ్మ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, వైద్యాధికారులు, నాయకులు తిరుపాల్, నాగ మద్దిలేటి, తిరుమలేష్ గౌడ్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, తహశీల్దార్ రమేష్‌బాబు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి అన్నారు. మంగళవారం బస్తిపాడు ప్రభుత్వ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. డాక్టర్లు 439 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా తహసీల్దార్, ఎంపీడీఓ, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్, సర్పంచ్ బోయ రవి, ఎంపీటీసీ నాగేశ్వరరావు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవి కిషోర్, ఉలిందకొండ, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, సీహెచ్ఓ సురేష్, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం


మెడికల్ క్యాంపులో ఈసీజీ తీస్తున్న దృశ్యం

గడివేముల: పేదల రోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన గడివేముల సచివాలయం-2 పరిధిలోని జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును మంగళవారం ఆయన ప్రారంభించారు. మెడికల్ క్యాంపునకు ప్రజల నుంచి విశేషస్పందన లభించింది. డాక్టర్లు బీపీ, షుగర్, మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర పరీక్షలు చేశారు. అదేవిధంగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలచెన్ని, ఎంపీటీసీ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్యం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల చెంతకే వైద్య సేవలు అందిస్తున్నారు. బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందించారు. ఎలాంటి డబ్బు లేకుండా ఉచితంగా ఆరోగ్య శ్రీ కింద స్టంట్, కంటి ఆపరేషన్ చేయించుకున్నాను. గతంలో ఏ ప్రభుత్వాలు ఇంటి దగ్గరకే వచ్చి పరీక్షలు చేయలేదు. మాలాంటి పేదలకు ఎంతగానో ఉపయోగపడేల పాలన అందిస్తున్న సీఎంకు ధన్యవాదాలు.

– బి. లక్ష్మిరెడ్డి, రామచంద్రనగర్


చాలా ఉపయోగం



జగననన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎమ్‌లు ఇంటింటికి వచ్చి బీపీ, షుగర్, హీమోగ్లోబిన్ పరీక్షలు చేసి వైద్య శిబిరానికి రావాలని తెలియజేశారు. హిమోగ్లోబిన్ పరీక్ష చేసి 8 పాయింట్ల రక్తం ఉందని వైద్యులు చెప్పారు. పేద ప్రజలు ఇలాంటి పరీక్షలు చేసుకోవలంటే ఎంతో ఖర్చు అవుతుంది. పైసా ఖర్చు లేకుండా పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– శరీఫాబీ, శరీన్‌నగర్

గ్రామంలోనే వైద్య సేవలు అందించడం సంతోషకరం



గ్రామంలోనే వైద్య సేవలు ఉచితంగా అందించడం సంతోషంగా ఉంది. గత ప్రభుత్వంలో వైద్యం గురించి పట్టించుకోలేదు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు ఎంతో ఉపయోగపడుతుంది. నాకు ఆరోగ్య సరిగాలేకపోవడంతో బీపీ, గ్యాస్, గుండె పరీక్షలలు చేశారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

–దాసరి వెంకటేశ్వర్లు, గడివేముల

ఉచితంగా కంటి అద్దాలు ఇచ్చారు



ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉచితంగా నాకు అవసరమైన కంటి అద్దాలు ఇచ్చారు. మా ఇంటి వద్దకే వైద్యసిబ్బంది, వలంటీర్లు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగింది. ఇంతా పెద్ద ఎత్తున్న పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

–వడ్డె వెంకటలక్ష్మమ్మ,గడివేముల

గుండె పరీక్షలు ఉచితంగా చేశారు



నాకు గుండె పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గత కొన్ని రోజుల నుంచి వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నా. వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులను అందజేశారు. గతంలో ఏ ప్రభుత్వం మా ఆరోగ్యం గురించి పట్టించుకోలేదు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన సీఎం సార్‌కు థాంక్స్.


–దస్తగిరి,గడివేముల


సి.బెళగల్‌లోని ఓ వీధిలో పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

సి.బెళగల్ అభివృద్ధికి కృషి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ పరిశీలిన అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే సి.బెళగల్‌లో పర్యటించారు. వారికి గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వీధులలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని శ్రీ వాల్మీకి రామాలయంలోని స్వామి వార్లకు ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, వాల్మీకి సంఘం సభ్యులు ఆయల నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే, ఎంపీలను సన్మానించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన మురికి కాలువపై కల్వర్టుల నిర్మాణానికి, సీసీ రోడ్ల ఏర్పాటకు సహకరించాలని ఎంపీను గ్రామ పెద్దలు కోరగా నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా షాదీఖాన నిర్మాణానికి సహకరించాలని పెద్దలు కోరడంతో తన వంతు సహకారం అందిస్తామని చెప్పారు. వీరివెంట ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్, కర్నూలు మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎంఎస్ ఎంబాషా, పెద్దలు పెద్ద మునెప్ప, రాము, రఘవరెడ్డి, బసయ్య, రంగన్న, లక్ష్మన్న, నరసింహుడు తదితరులు ఉన్నారు.

గడపగడపకు జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు


మహిళకు మందులను అందజేస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్ : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గడపగడపకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, ప్రజలంతా ఆరోగ్యంగా జీవించేందుకు వీలవుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం ఉపాధ్యక్షుడు డా.ఆదిమూలపు సతీష్ అన్నారు. మంగళవారం కోడుమూరులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డాక్టర్ ఆదిమూలపు సతీష్ జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డా.ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్.రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ ప్రవేశపెడితే ఆయన వారసుడిగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రతి కుటుంబాన్ని, ప్రతి వ్యక్తిని ఆరోగ్యంగా ఉంచేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. అనంతరం సురక్ష కార్యక్రమానికి అవసరమైన కొన్ని రకాల మందులను డా.ఆదిమూలపు సతీష్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, వైసీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, శివరాముడు, బోరెల్లి సోమన్న, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష..ప్రజల ఆరోగ్యానికి రక్ష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజారోగ్యానికి రక్ష అని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. పేదల ఆరోగ్యంపై సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మారుమూల గ్రామాల్లో సైతం మెరుగైన వైద్య సేవలు అందజేసేందుకు సీఎం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, అయితే కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దిన్నెదేవరపాడులో ఐదు రోజులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించామని, అయితే తహసీల్దార్, కనీసం స్థానిక వీఆర్ఓ కూడా పాల్గొనకపోవడంలో అర్థం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా పద్ధతులు మార్చుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, తహసీల్దారు శివ రాముడు, ఈఓఆర్‌డీ అనురాధ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, వేణుగోపాల్, వీఆర్ఓ రంగనాథ్, పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్

కోడుమూరు రూరల్ : మండల కేంద్రం కోడుమూరు గ్రామ సచివాలయం-3 పరిధిలోని కోటవీధి ప్రాథమిక పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, ప్రజలు హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చింతమానుపల్లెలో....

సి.బెళగల్: మండల పరిధిలోని చింతమానుపల్లె గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ సునీత తెలిపారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించే వైద్య శిబిరానికి వైద్య నిపుణులు హాజరవుతారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సారా విక్రేతల అరెస్టు

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో సారా అమ్ముతున్న ఇద్దరు మహిళలను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. జంగాలపేటకు చెందిన బోయ రేణుక, పద్మావతి కొద్దిరోజులుగా నాటుసారా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. మహిళల నుంచి 40 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

ఇంటి ముంగిటకే.. కార్పొరేట్ వైద్యం


మాట్లాడుతున్న సద్దల సూర్యనారాయణరెడ్డి

పాణ్యం: ఇంటి ముంగిటనే కార్పొరేట్ వైద్యం అందజేస్తు ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీపీ ఉసేన్‌బీ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గోరవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. డాక్టర్లు సునీతా, అభిషేక్, రంజిత్‌కుమారి, జగన్‌మోహన్‌రెడ్డి, సునీల్‌బాబు మొత్తం 352మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. 103మందికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ లంకె రాజమ్మ, ఎంపీడీఓ దస్తగిరి, సచివాలయ కన్వీనర్ గుద్దెటి సుమంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయభాస్కర్, శేఖర్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు


తీవ్రంగా గాయపడిన బోయ భీమనాయుడు


స్పృహ కోల్పోయిన కర్రెన్న

సి.బెళగల్: మండలంలోని ముడుమాల గ్రామంలో మంగళవారం ఇరువర్గాలు ఘర్షణ పడటంతో నలుగురు గాయపడినట్లు ఎస్ఐ పీరయ్య తెలిపారు. గ్రామంలోని బోయ కర్రెన్న అతడి అన్నదమ్ములు, దాయాదుల కుటుంబ సభ్యులు మధ్య కొంత కాలంగా పొలం అమ్మకాలు, పొలం దారి విషయంలో వివాదం నడుస్తుంది. ఈ విషయాల్లో పలుమార్లు ఘర్షణపడి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో కేసులు సైతం నమోదు అయ్యాయని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మరోసారి పొలం దారి విషయంలో దాయాదుల కుటుంబ సభ్యులైన పోలకల్ గ్రామానికి చెందిన కోతి రసూల్ అతడి వర్గం సభ్యులు మునేష్, రామాంజనేయులు, వాసు తదితరులు బోయ కర్రెన్న కుటుంబ సభ్యులతో జరిగిన వాదులాట ఘర్షణ మారిందన్నారు. ఈ ఘర్షణలో బోయ కర్రెన్న అతడికి కుమారులైన బోయ భీమానాయుడు, బోయ సోమనాయుడు, బోయ తిమ్మప్పలకు రక్త గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. అయితే గాయపడిన వారిలో బోయ భీమనాయుడు పరిస్థితి విషమంగా ఉందని, బాధితుల ఫిర్యాదు మేరకు కోతిరసూల్, అతడి వర్గం సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.